## జనపథం - జనపదం

# ఇదా మన(ను) పరంపర?

- నిత్యానంద్.

పాఠకులు సరిగానే గ్రహించారు. నా ఉద్దేశ్యము 'మన పరంపర' లేదా 'మను పరంపర' అని. 'మను పరంపర' అంటే పెండ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు వ్రాయబోతున్నానని అనుకోకండి. నేడు మానవులుగా పిలువబడుతున్న మనం, మను మహారాజు వారసులం కదా! మన్వంతరముగా పిలువబడే 4,320,000 సంవత్సరముల కాలము ఒక్కో మనువు పరిపాలిస్తాడని, నేడు ఏడవ మనువైన వైవశ్వతుడు పాలిస్తున్నాడని మన నమ్మకము. మను ధర్మశాస్త్రము 100,000 శ్లోకములతో ఉండేది; నేడు 2685 శ్లోకములు మాత్రమే లభ్యము. ఇంతకీ నాటి వ్యవస్థకి, నేటి వ్యవస్థకి ఎందుకు తేడా? నాడు సమాజ ప్రగతిని దృష్టిలో ఉంచుకొని, ఎవరి నైపుణ్యాన్నిబట్టి వారికి ఆ పనిని అప్పగించేవారు. అది కాలక్రమేణా కులముగా మార్పుచెందింది. మరి నేడు స్వార్థప్రయోజనాలకోసం రాజకీయ నాయకులు, ప్రజలు కూడా కులవ్యవస్థని ఉపయోగించుకుంటున్నారు.

ఒక టోపీల వర్తకుడు వ్యాపారనిమిత్తము కొన్ని టోపీలు తీసుకుని పట్టణానికి బయలుదేరాడు. మార్గమధ్యమున అలసి ఒక చెట్టునీడన విశ్రమించాడు. పిలిస్తే అదృష్టం కలిసిరాదేమో గాని, పిలువకుండానే అతనికి నిద్ర ముంచుకొచ్చింది. తీరా లేచి చూస్తే, తను పెట్టుకున్న టోపీ తప్ప మిగిలిన టోపీలన్నీ కోతుల చేతులలోను, కోతులు చెట్టుకొమ్మల మీద దర్శనమిచ్చాయి. వెంటనే ఆ వర్తకునికి అతని తాత చెప్పిన సంఘటన గుర్తుకొచ్చిందట. తక్షణమే ఆ వర్తకుడు తన నెత్తిన ఉన్న టోపీని తీసి నేలకు విసిరి కొట్టాడు. మీరు ఊహించే ఉంటారు తరువాత ఏమి జరిగి ఉంటుందో! "అన్ని కోతులు వాటి దగ్గర ఉన్న టోపీలు నేలకు విసిరికొట్టాయని" మీరనుకుంటే తప్పులో కాలేసినట్లే! అవి త్రేతాయుగం కోతులు కాదు, కలియుగం కోతులు. మనమైతే మన తాతలనుండి నేర్చుకున్న విషయాలు యథాతథంగా అమలు చేస్తున్నాం! (కాస్తంత కూడా మార్పూ చేర్పూ లేకుండా!) మరీ ఆచరించడానికి కష్టమని అనిపిస్తే అవీ వదిలేస్తున్నాం. కాని కోతులు అలాకాదు యుగధర్మాన్ని అవగతం చేసుకుంటూ చరిస్తున్నాయేమో, వర్తకుడు నేలకు విసిరికొట్టిన టోపీకూడా చటుక్కున ఎగరేసుకుపోయిందో కోతి. తెల్లముఖము వెయ్యడం వర్తకుని వంతు అయ్యింది. "ఇలా అయ్యింది ఏమిటిచెప్మా!" అని విచారిస్తున్న వర్తకుని గాంచి ఓ కోతి అందిట "తాతలు నీకే కాదు, మాకూ ఉన్నారు! మీ తాతలు నీకు చెప్పినట్లే, మా తాతలు కూడా వారి అనుభవాలు మాకూ చెప్పారు." అని. ఇంతకీ ఇదంతా ఎందుకు వచ్చిందంటే మన పురోగతి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉంది. మిగిలిన జంతుజాలం ఎన్నో విధములుగా ప్రగతిని సాధిస్తున్నాది.

నా చిన్నతనంలో కుక్కలు కోడి పిల్లల్ని కరుచుకుపోవడం, పిల్లుల్ని వెంటతరమడం; పిల్లులు ఎలుకల్ని పట్టుకోవడం గుర్తు. జాతి వైరంగల జంతువుల సఖ్యత మున్యాశ్రమములలోనే సాధ్యమని అనుకునేవాడిని. కాని నేడు జాతి వైరాన్ని మరచి, జంతువులు సైతం సఖ్యతతో మెలగుతున్నాయి. మానవుడు వివేకము కలవాడని మనమనుకుంటున్నా - కుల, మత, జాతి విద్వేషాలతో మారణకాండ సృష్టించడము - స్వార్థప్రయోజనాలు, మిగతా కనీస అవసరాలని తోసి రాజనడం - నేటి దుస్తితికి, అశాంతికి కారణం. ఒకప్పుడు 'తినడానికి తిండి, కట్టుకోడానికి బట్ట, ఉండడానికో గుడిసె ఉంటే చాలు కదా! ఈ దొంగతనాలు, దోపిడీలు ఉండవు.' అని అనుకునేవాణ్ని. కాని నా అభిప్రాయం తప్పని అర్థమయ్యింది. నిరాడంబరంగా ఉన్నవారికి, వారెంత ప్రజ్ఞావంతులైనా, సమాజంలో గుర్తింపు తక్కువ. నీతి, నియమాల కన్నా ఆడంబరం, అధికారం రాజ్యాన్నేలుతున్నాయి. తుదకు కోట్లకు పడగలెత్తిన రాజకీయనాయకుని నుండి, సర్వం త్యజించిన ముని శ్రేష్ఠుని వరకు మంది మార్బలం ఉంటేనే ఎవరైనా లెక్కచేసేది. లేకపోతే పిచ్చివానికిందే జమకడతారు. జంతుజాలం వాళ్ళ పూర్వీకుల నుండి మంచిని నేర్చుకుని, ఉన్నత దశలకు చేరుతుంటే - మానవులు మన ఆచారములు, సంప్రదాయములు విస్మరించి అధోగతి పాలవుతున్నారు. ప్రతి చిన్న విషయానికి ఆందోళన పడడం, పిల్లలకు నీతిని తెలియజేయకపోవడం, తల్లితండ్రులే అడ్డదారులు తొక్కడం, ప్రగతిని సాధిస్తున్నామనే భ్రమలో అధః పాతాళానికి దిగజారిపోవడం శోచనీయం. ఈ విషయంలో ఎవరికి వారు ఆత్మవిమర్శ చేసికొని, వారికి మంచిదని తోచిన మార్గాన్ని అనుసరించడం అవసరం.

నేటి తరం పిల్లలకు మన పండుగలు, వాటి ప్రాముఖ్యము తెలియవు. నేడు మన దేశంలో కూడా (పశ్చిమ దేశాల అనుసరణ మోజులో పడి) ఫ్రెండ్‌షిప్ డే, మదర్స్ డే, ఫాదర్స్ డే, వేలంటైన్స్ డే వంటివి బ్రహ్మాండముగా జరుపుతున్నారు. కాని దీపావళి, విజయదశమి, సంక్రాంతి వంటి పండగలను విస్మరిస్తున్నారు. వాటి ప్రాముఖ్యము పెద్దలు కూడా తెలియజెప్పే స్థితిలో లేకపోవడం గమనించవలసిన విషయము. పండుగల సమయములలోనూ, ముఖ్యమైన వేడుకల సమయములలోనూ పిల్లలు పెద్దలకు నమస్కరించడము, పెద్దలు పిల్లల్ని దీవించి, కానుకలను ఇవ్వడము మన ఆనవాయితీ. కళ్ళకు కాటుక దిద్దడము, నుదుట బొట్టు పెట్టుకోవడము, ముఖానికి పసుపు, కాళ్ళకు పారాణి రాసుకోవడము ఆరోగ్యాన్ని ఇనుమడింపజేయడానికే. కానీ వీటన్నిటికీ ఒకటొకటిగా తిలోదకాలు ఇస్తున్నాము. ఫలితంగా మన నుండి మన తరువాత తరాలకు - మన ఆచారములు, నడవడిక మొదలైనవి చేరడము లేదు. ఒకసారి ఖాళీ ఏర్పడితే, ఆ ఖాళీ భర్తీ చేయడం కష్టం. కావున, మన సంస్కృతి, సంప్రదాయము, పండుగలు, స్వాతంత్ర్య సమరములో పాల్గొన్న నాయకులు, కవులు, రచయితలు, గ్రంథాలు, నదీనదాలు, ముఖ్యమైన నగరాలు, ముఖ్యమైన కట్టడాలు మొదలైన విషయములను తెలియజేయడం ఎంతైనా అవసరం. భావి తరాలకు మనము అందించగలిగే విలువైన కానుక అదే.

నీ స్వార్థం కాదు బ్రతుకు - నిస్వార్థంగా బ్రతుకు.
నీతి నిజాయితీలే జాతికి నిలకడైన పునాది.